

సోమవారం ఢిల్లీలో ఎస్సీ, ఎస్టీ, మానవ హక్కుల కమిషన్‌ను కలిసిన బీఆర్ఎస్ బృందం, లగచర్ల బాధితులు

# కొట్టే హక్కు పోలీసులకెక్కడిది?

## అర్ధరాత్రి తెగబడి ఇంత అరాచకమా?!.. మహిళల పట్ల అంత దారుణ ప్రవర్తనా?

- కరెంటు తీసి, వికృత చేష్టలా?
- సీఎస్, డీజీపీ ఏం చేస్తున్నారు?
- 2 రోజుల్లో నివేదిక ఇవ్వండి!
- మహిళ, ఎన్‌హెచ్ఆర్సీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్లు, సభ్యుల ఆగ్రహం
- బాధితుల కన్నీళ్లు తుడిచి అండగా ఉంటామని భరోసా

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, ఆ చుట్టుపక్కల తండాల్లో ఈ నెల 11న అర్ధరాత్రి కరెంటు తీసేసి పోలీసులు, కొందరు ప్రైవేట్ వ్యక్తులు సాగించిన అరాచకంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. బాధితుల గోడు ప్రత్యక్షంగా విన్న తర్వాత పోలీసు వ్యవస్థ అకృత్యాలపై తీవ్రంగా మండిపడింది. లగచర్లకు చెందిన పలువురు బాధితులు సోమవారం ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్, జాతీయ ఎస్సీ కమిషన్, జాతీయ ఎస్టీ కమిషన్ల వద్దకు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై నేరుగా ఫిర్యాదు చేశారు. ఉదయం మానవ హక్కుల కమిషన్ వద్దకు వెళ్లిన తర్వాత మహిళా కమిషన్ వద్దకు వెళ్లిన బాధితులు.. తమ భూములను అన్యాయంగా గుంజుకుంటున్నారని, తిరగబడిన రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని, అర్ధరాత్రి కరెంటు తీసేసి పోలీసులు తమ గిరిజన బిడ్డలపై అసభ్యంగా ప్రవర్తించారని కన్నీటి పర్యంతమయ్యారు. అడ్డుకున్న మహిళలపై అర్ధరాత్రి పోలీసులు లాఠీలతో దాడులు చేశారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు కేసుల గురించి బాధితులను అడిగారు. దాడి ఎలా జరిగింది? ఎప్పటి నుంచి ఆందోళనలు జరుగుతున్నాయి? ఎందుకు జరుగుతున్నాయి? అందుకు కారణాలు ఏంటి? ఇంత జరిగినా పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదు? అందుకు దారి తీసిన పరిస్థితులేంటి? అనే విషయాలన్నీ మహిళా కమిషన్ సభ్యులు బాధితులను అడిగారు. బాధితులు వారికి సవివరంగా సమాధానం చెప్పారు.



పోలీసుల పహారాలో నిర్మానుష్యంగా ఉన్న లగచర్ల

### భావోద్వేగానికి లోనైన కమిషన్ సభ్యులు

ఫార్మా కంపెనీలు వద్దని, ఈ ఆందోళనలన్నీ దాదాపు 9 నెలల నుంచి జరుగుతున్నాయని.. తమ భూములు కాపాడుకునేందుకు ముఖ్యమంత్రి ఇంటికి వెళ్లినా కలిసే అవకాశం ఇవ్వలేదని కమిషన్లకు బాధితులు వివరించారు. మొన్నటి భూ సేకరణ ప్రజాభిప్రాయంపై తమకు సమాచారం లేదని, కలెక్టర్ వస్తారనే సమాచారం లేదని, ముఖ్యమంత్రి అన్నయ్య తిరుపతిరెడ్డి ఎప్పుడు తమ గ్రామాలకు వచ్చినా పోలీసుల బందోబస్తుతోనే వస్తున్నాడని, ఈ సారి అతనితో తాడోపేడో తేల్చుకుందామని తమ బిడ్డలు ఆందోళనలకు సిద్ధమయ్యారని కమిషన్‌కు తెలిపారు. కలెక్టర్‌ను తాము కొట్టలేదని, ఆయన కూడా తనపై దాడి జరగలేదనే విషయాన్ని మీడియా ముందు చెప్పారని గుర్తుచేశారు. ఇన్ని రోజులు ఫార్మా కంపెనీల కోసం సంతకాలు పెట్టించుకునేందుకు తిరుపతిరెడ్డి ఎందుకు దొంగచాటుగా తిరుగుతున్నాడో చెప్పాలని కోరారు. ఈ నేపథ్యంలో 'కేసులు పెట్టారా? దెబ్బలు రిమాండ్ రిపోర్టులో ఉన్నాయా?' అనే విషయాలను కమిషన్ సభ్యులు ఆరా తీశారు. దీంతో బాధితులు సమాధానమిస్తూ.. పోలీసులకు ఫిర్యాదు ఎందుకు చేయలేదన్న విషయాన్ని వివరించారు. తమను పోలీసులు ఇంట్లోంచి బయటకు రానివ్వడం లేదని, ఒక వేళ బయట అడుగుపెడితే కొందరు ప్రైవేట్ వ్యక్తులు బైక్‌లు, కార్లలో తమను వెంబడిస్తున్నారని కమిషన్ ముందు ఉంచారు. దీంతో మహిళా కమిషన్ కూడా తమ సభ్యులను అక్కడికి పంపి వాస్తవాలను తెలుసుకొని, బాధ్యులైన పోలీసులు, వారికి సహకరించిన ప్రైవేట్ వ్యక్తులపై తక్షణం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చింది. లగచర్ల బాధితుల దుస్థితిని తెలుసుకొని, వారి గోడు విని, కమిలిపోయిన దెబ్బల వీడియోలు చూసి కొందరు సభ్యులు కూడా తీవ్ర భావోద్వేగానికి లోనైనట్టు తెలిసింది.

### ఆందోళన వద్దు: ఎన్‌హెచ్ఆర్సీ

ఉదయం నేరుగా జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను కలిసి బాధితులు తమ గోడు వెలిబుచ్చారు. కమిషన్ చైర్మన్, ఇతర సభ్యులకు ఆ రోజు అర్ధరాత్రి జరిగిన ఉదాంతాన్ని, పోలీసుల అరాచకాలను వివరించారు. బాధితుల గోడు విన్న కమిషన్ సభ్యులు పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకట్రెండు రోజుల్లోనే సీఎస్, డీజీపీ నుంచి వివరణ తీసుకుంటామని చెప్పారు. వీలైతే కమిషన్ సభ్యులను లగచర్లకు పంపిస్తామని హామీ ఇచ్చారు. పోలీసులు సరైన నివేదిక ఇవ్వని పక్షంలో తమ సభ్యులే నివేదికను తయారు చేసి, కమిషన్‌ను అందిస్తారని, ఆ విషయంలో ఎలాంటి ఆందోళన చెందొద్దని ఎన్‌హెచ్ఆర్సీ భరోసా ఇచ్చింది. ఒక్కో బాధితురాలి నుంచి వివరాలు తీసుకొని.. సుదీర్ఘంగా 40 నిమిషాల పాటు వారి గోడును విన్నది.

### జాతీయ ఎస్సీ కమిషన్ వద్ద..

మానహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన తర్వాత బాధితులు నేరుగా జాతీయ ఎస్సీ కమిషన్ వద్దకు వెళ్లి లగచర్లలో ఫార్మా కంపెనీల బాధితుల్లో గిరిజనులతో పాటు ఎస్సీలు, బీసీలు ఉన్నారని, అక్కడ అన్ని కులాల పట్ల జరుగుతున్న అకృత్యాలపై స్పందించాలని ఫిర్యాదు చేశారు. కమిషన్ సభ్యులు సైతం లగచర్ల ఘటన, పోలీసుల థర్డ్ డిగ్రీ వివరాలు తెలుసుకున్నారు. బాధితుల పక్షంగా బీఆర్ఎస్ నేత, ఐపీఎస్ మాజీ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ జరిగిన దాడి, అరాచకాలను ఎస్సీ కమిషన్‌కు వివరించారు. తక్షణమే తెలంగాణ సీఎస్, డీజీపీలకు నోటీసులు పంపిస్తామని కమిషన్ హామీ ఇచ్చింది. రెండు మూడు రోజుల్లో అవసరమైతే కమిషన్ సభ్యులు అక్కడ పర్యటిస్తారని భరోసా ఇచ్చింది.

### జాతీయ ఎస్టీ కమిషన్‌కు..

ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు అనంతరం జాతీయ ఎస్టీ కమిషన్‌ను కలిసి లగచర్ల బాధితులు ఫిర్యాదు చేశారు. వారి బాధను, జరిగిన దారుణాలు ప్రత్యక్షంగా విని ఎస్టీ కమిషన్ సభ్యుడు చలించిపోయారు. ఒక్కొక్కరికి ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. విడివిడిగా ప్రశ్నించి పూర్తి వివరాలు రాబట్టారు. బాధితుల్లో ఎక్కువ మంది ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారే ఉండటంపై ఎస్టీ కమిషన్ కూడా ప్రత్యేక దృష్టి పెడుతుందని హామీ ఇచ్చారు. న్యాయం జరిగే వరకూ బాధితుల పక్షాన కమిషన్ ఉంటుందని భరోసా ఇచ్చారు. త్వరలోనే తాను లగచర్లకు వచ్చి మరిన్ని వివరాలు సేకరిస్తానని బాధితులతో చెప్పారు. అప్పటికప్పుడే తెలంగాణ డీజీపీకి, సీఎస్, వికారాబాద్ కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు పంపినట్టు తెలిసింది.



జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్‌కు తమ బాధలు వివరిస్తున్న లగచర్ల బాధితులు

### ఇంత క్రూరంగా హింసిస్తారా?

'ఇంత క్రూరంగా హింసిస్తారా? ఇంత దారుణానికి ఒడిగట్టిన వారిని అస్సలు వదిలే ప్రసక్తే లేదు. ఏ అధికారం ఉన్నదని పోలీసులు అర్ధరాత్రి మఫ్టీల్లో వచ్చి అరాచకం సృష్టిస్తారు?' అని జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ ప్రశ్నించారు. 'అర్ధరాత్రి ఇండ్లలోకి దూరి అరెస్టులు చేయాల్సిన అవసరం ఏమొచ్చింది? వాళ్లేమన్నా తీవ్రవాదులా? ఉగ్రవాదులా? సెల్‌ఫోన్ టవర్ల నుంచి సిగ్నళ్లు, ఇంటర్నెట్ బంద్ చేసి అరాచకం సృష్టించడం వెనుక ఎవరున్నారు?' అని మహిళా కమిషన్ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. 'అర్ధరాత్రి కరెంటు తీసేసి, మహిళల ఛాతీలపై కాళ్లు పెట్టి, కుతికలు పిసుకుతూ, ఎదలపై అసభ్యంగా తాకుతూ, ప్రైవేట్ పార్ట్స్, తొడలపై లాఠీలతో కొడుతూ ఎందుకింత దారుణాలకు ఒడిగట్టారో చెప్పాలి' అని తెలంగాణ చీఫ్ సెక్రటరీ, డీజీపీని వివరణ కోరతామని తెలిపారు. 'పోలీసులకు ఇంత ధైర్యం ఎక్కడినుంచి వచ్చింది?' అని కమిషన్ చైర్‌పర్సన్ సీరియస్ అయ్యారు. లగచర్ల బాధితులు తమకు ఎక్కడెక్కడ దెబ్బలు తగిలాయో చూపించారు. అనంతరం ఇలా ఎందుకు జరిగిందని కమిషన్ బాధితులను ప్రశ్నించింది. 20 నిమిషాలు పురుషులు, బాధిత మహిళలతో మాట్లాడిన తర్వాత.. పురుషులను బయటికి పంపి.. కమిషన్ సభ్యులు ప్రత్యేకంగా బాధిత మహిళలతో మాట్లాడారు. పోలీసులు అర్ధరాత్రి చేసిన అరాచకాన్ని మహిళలు కమిషన్‌కు క్షుణ్ణంగా వివరించారు. ఆ రోజు పోలీసులు వచ్చిన విధానం, గడ్డపారలు పట్టుకొని తలుపులు పగలగొడతామని బెరించిన తీరును వివరించారు. ప్రైవేట్ పార్ట్స్‌ను తాకుతూ అసభ్యంగా ప్రవర్తించారని చెప్తూ కన్నీటి పర్యంతమయ్యారు. అలా ఎందుకు చేశారు? దాని వెనుక ఎవరున్నారు? ఫార్మా విలేజ్ పేరుతో తండాల్లో ఎలాంటి అకృత్యాలు జరుగుతున్నాయనే అంశాలను కమిషన్ సభ్యులు తెలుసుకున్నారు. బాధిత మహిళలతో 35 నిమిషాల పాటు మాట్లాడి, కన్నీళ్లు పెట్టుకున్నవారిని దగ్గరకు తీసుకొని ఓదార్చారు. బాధితులు చెప్పిన వివరాలన్నీ రికార్డ్ చేసుకున్నారు. తక్షణం చర్యలు తీసుకునేందుకు ఎందుకు వెనుకాడాలంటూ ఓ సభ్యురాలు క్యాబిన్‌కు వెళ్లారని, బాధితులు చెప్పిన అంశాలపై తక్షణం వివరణ ఇవ్వాలనే ఆదేశాలతో నోటీసులు టైప్ చేయించారని తెలిసింది. అనంతరం ఈ దుర్ఘటనపై వివరణ ఇవ్వాలని తెలంగాణ సీఎస్, డీజీపీ, వికారాబాద్ కలెక్టర్, ఎస్పీలకు నోటీసులు పంపిస్తామని, న్యాయం జరిగేంత వరకూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అవసరమైతే తామే నేరుగా లగచర్లకు వచ్చి వివరాలు సేకరిస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది.

# రాత్రయితే పొలాల్లో దాక్కుంటున్నం!

## ఆద్దమరేత్రి యమునోళ్లొచ్చినట్టు వచ్చి మా వోళ్లను తీస్కబోయింద్రు

## మొగోళ్లు యాడున్నరో, ఏమైనరో తెల్వదు: కమిషన్ ముందు బాధితులు

- మా వాళ్ల కోసం కండ్లల్ల వొత్తులేసుకొని చూస్తున్నం
- పోలీసుల బూటు చప్పళ్లతో గుబులైతది
- మా సమాధుల మీద శంకుస్థాపన చేసుకోండి
- డీజీపీ, సీఎస్‌తో నివేదిక కోరుతాం
- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్
- ఘటనపై ఎస్పీ నిలదీత.. పూర్తి స్థాయి విచారణకు ఆదేశం



బాధితుల గోడు వింటున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్‌నాయక్

మహబూబ్‌నగర్ (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/కొడంగల్, నవంబర్ 18: 'అద్దమ్మ రేత్రి యమునోళ్లొచ్చినట్టు వచ్చిన్రు.. మగపురుగు లేకుండ ఎత్తకపోయిన్రు.. ఆళ్ల జాడ ఎక్కడో తెల్వదు.. అసలు బతికే ఉన్నర? లేదా అని గుబులైతుంది.. అప్పటి నుంచి పిల్లాజెల్ల, ముసలి ముతక అందరికీ ఆకలి దప్పులు కరువైనయ్! రాత్రయితే నిద్రనేదే దూరమైంది.. పోలీసులు వస్తుర్రు అంటే గుండెల్ల గుబులు పుడుతుంది.. ఊళ్లె నించి ఒక్కలు కూడా పనులకే పోతలే.. పిల్లలెవరూ బడికి పోతలే.. బువ్వబెట్టే భూములియ్యమన్నందుకే మాకీ గతి.. మళ్ల మావోళ్లు (మొగోళ్లు) ఊళ్లెకొస్తేనే మా బాధ తీరుద్ది.. అప్పటిదాకా మాకిదే గతి.. ఎట్టయినా మావోళ్లని రప్పియుర్రి సారూ' అంటూ సోమవారం పర్యటించిన ఎస్టీ జాతీయ కమిషన్ బృందం ఎదుట లగచర్ల, రోటిబండ తండ సమీప గ్రామాల బాధిత కుటుంబాలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కన్నీటి పర్యంతమై వారి కాళ్లపై బడి తమకు జరిగిన అన్యాయాన్ని ఏకరువు పెట్టారు. లగచర్ల ఘటనపై తీవ్రంగా స్పందించిన జాతీయ ఎస్టీ కమిషన్ బృందం సోమవారం లగచర్ల, రోటిబండ తండాలో పర్యటించింది. మధ్యాహ్నం ఒకటిన్నరకు రోటిబండ తండాకు చేరుకున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్‌ను చూడగానే కట్టలు తెంచుకున్న దుఃఖంతో ఆయన కాళ్లపై బడ్డారు. మమ్మల్ని బతకనీయండి.. అంటూ వేడుకున్నారు. దీంతో చలించిన ఆయన గిరిజనులతోపాటు నేలపైనే కూర్చొని వారి సమస్యలను సావధానంగా విన్నారు. 'డబ్బుతో కాదు సెంటిమెంట్‌తో కూడుకొంది మా పోరాటం.. మా ఇష్టాలను గ్రహించాలి.. బలవంతంగా భూ సేకరణ చేపట్టవద్దు' అంటూ వేడుకున్నారు. అన్యాయంగా భూములు లాక్కోవాలని చూస్తే సహించబోమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలానా కంపెనీ ఏర్పాటు చేస్తామంటూ ప్రజలకు తెలపాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? అంటూ నిలదీశారు. దీంతో చలించిన కమిషన్ సభ్యుడు.. ఎస్పీ నారాయణరెడ్డిని నిలదీశారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పాలని, అరెస్టులను వెంటనే ఆపాలని, ఇప్పటికే అరెస్టు అయిన వారిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రమేయం లేకపోతే విడుదల చేయాలని ఆదేశించారు. లగచర్లలో జరిగిన ఘటనపై డీజీపీ, సీఎస్‌లు నివేదిక ఇవ్వాలని కోరుతామని మీడియా ఎదుట ఆదేశించారు. ఇక మీదట ఏంచేసినా కమిషన్‌కు పూర్తి నివేదిక ఇచ్చాకే చర్యలు తీసుకోవాలని పోలీసులకు గట్టిగా వార్నింగ్ ఇచ్చారు.

### అధైర్యపడొద్దు: ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్

ఎవరూ భయపడొద్దు.. జరిగిన సంఘటనను త్వరలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకునేందుక చొవర తీసుకుంటా.. మళ్లీ ఏదైనా జరిగితే నాకే స్వయంగా ఫోన్ చేయండి.. అని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ లగచర్ల బాధితులకు భరోసా కల్పించారు. బయట ఉన్న వారిని తండాలకు రప్పించుకొని ప్రశాంతంగా జీవించాలని సూచించారు. ఎటువంటి సంఘటనలు, ఇబ్బందులు కలిగినా తనకు ఫోన్ చేయాలని గిరిజన మహిళలకు తన ఫోన్ నంబర్‌ను ఇచ్చారు. త్వరలో సమస్య పరిష్కరించబడి వాతావరణం సర్దుకుంటుందని హామీ ఇచ్చారు. లగచర్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్‌ను సస్పెండ్ చేయడంపై కమిషన్ బృందం మండిపడింది. ఈ ఘటనపై వెంటనే పునర్విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని ఎస్పీని కోరారు.

### మా సమాధుల మీద శంకుస్థాపన చేయ్..

'మేము భూములపైనే ఆధారపడినం, అవే పోతే మా బతుకులు ఆగమైతయ్, సర్కారు భూములు లాక్కొని ఉద్యోగాలు, ఇంటిస్థలంతో పాటు రూ.10 లక్షలు ఇస్తామంటుంది. మాకు సదువులే లేవు.. ఏం ఉద్యోగాలు ఇస్తరు, ఏవిధంగా బతకాలి.. అని బాధిత గ్రామాల ప్రజలు కమిషన్ ఎదుట తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రభుత్వం పట్టుదలకు పోతే మేము సచ్చాక మా సమాదుల మీద శంకుస్థాపన చేయండి' అంటూ కమిషన్ ముందు గోసరిల్లారు. 'సంఘటన స్థలంలో లేని వాళ్లను సైతం పోలీసులు ఎత్తుకెళ్లింద్రు.. కొంత మంది భయానికి తండాలు వదిలిపోయింద్రు. ఏం జరిగినా మా భూముల్ని మాత్రం వదులుకోం.. అరెస్టు చేసిన మా మొగోళ్లను ఇడిచి పెట్టండి' అని వేడుకున్నారు. భూములు పోతయనే బాధతో తిండి, నిద్ర లేకుండా గడుపుతున్నం.. మా భూములు ఇవ్వబోమని కలెక్టర్‌కు, తాసిల్దార్‌కు, ఆర్డీవోను కలిసి చెప్పుకున్నం. ఇవ్వాల్సిందేనని మీటింగులు పెట్టి చాలా ఇబ్బందులకు గురి చేసిన్రు.. అని చెప్పారు.

### కలెక్టర్ అని మాకు తెలవదు

లగచర్లలో గొడవైన రోజు వచ్చింది కలెక్టర్ అని మాకు తెల్వనే తెల్వదు. ఆ తర్వాత అర్ధరాత్రి లగచర్ల, రోటిబండతండా, పులిచెర్లకుంట తండాల్లో పోలీసులు ఇండ్లలోకి చొరబడి కనిపించినోళ్లను కనిపించినట్టు మొగోళ్లందరినీ లాక్కొనిపోయిన్రు. కొంతమంది ఎక్కడ మమ్మల్ని పోలీసులు తీసుకుపోతారో అన్న భయంతో పారిపోయిన్రు. ఇప్పుడు ఆడోళ్లం మాత్రమే మిగిలినం. మమ్మల్ని కూడా ఆడ పోలీసులతో తీసుకొచ్చి తన్ని తీసుకుపోతమంటూ బెదిరిస్తుర్రు. అందుకే మేమంతా రాత్రి కాగానే పొలాలు, గట్టులెంట పడుకుంటున్నాం.. మా బాధ ఎవరికి చెప్పుకోవాలి.. ఊరి నుంచి పోయిన మొగోళ్లు ఏడ ఉన్నరో? ఏం చేస్తున్నరో? తింటున్నరా? పస్తులున్నరా? బతికే ఉన్నరా? చనిపోయిన్రా? కూడా తెలియాలంటూ భోరున విలపిస్తూ కమిషన్ వద్ద వేడుకున్నారు. వాళ్ల కోసం మేమంతా తిండిమాని పిల్లలను బడికి ఊడా పంపకుండా బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం.. అని కమిషన్ సభ్యుడి ముందు వాపోయారు.

### ఆడోళ్ల మీద దౌర్జన్యం

ఆడవాళ్లు అని కూడా చూడకుండా పోలీసులు మద్యం మత్తులో మా పైన చెప్పుకోలేనంతగా ప్రవర్తించారని బాధిత మహిళలు కమిషన్‌కు గోడు వెళ్లబోసుకున్రు. ఆరోపించారు. అర్ధరాత్రి వచ్చిన పోలీసులు మీ మొగోళ్లు.. ఏడున్నరంటూ మాపై చేయి వేసి ఒంటిపై ఎక్కడ పడితే అక్కడ తడిమారని బావురుమన్నారు. మేమేం పాపం చేశామని రాత్రిపూట వచ్చారు. పోలీసులకు ఇది తగునా? అని ప్రశ్నించారు. మేం ఓట్లేస్తేనే రేవంత్ సీఎం అయ్యిండు.. మమ్మల్ని అడిగేది ఉండె.. మాతోనికి వచ్చేది ఉండే.. అంటూ వాపోయారు.

### పోలీసుల పహారాలో లగచర్ల

జాతీయ ఎస్టీ కమిషన్ బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో వికారాబాద్, పరిగి, కొడంగల్ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నుంచే నాకాబంది ఏర్పాటుచేశారు. సోమవారం ఉదయం నుంచి ఆ తండాలకు వెళ్లే రహదారులు మొత్తం దిగ్బంధించారు. దాదాపు 1,000 మంది పోలీసులు వాహనాల్లో గస్తీ తిరుగుతూ భయాందోళన సృష్టించారు. దీంతో లగచర్ల గ్రామంలో కమిషన్ బృందం ముందు ముగ్గురు, నలుగురు మినహా ఎవరూ ముందుకురాలేదు. లగచర్ల వైపు వెళ్లే రహదారులను నిర్బంధించారు. గ్రామాలు, తండాల్లోనూ మఫ్టీల్లో పోలీసులు తిరిగారు. కమిషన్ బృందం వెంట కూడా దాదాపు 100 మంది పోలీసులు వచ్చారు. కమిషన్ సభ్యుడితో మాట్లాడుతున్న గిరిజనులను వీడియోలు తీసి.. కొంతమంది బిగ్‌బాస్‌కు పంపించినట్టు చర్చ జరిగింది. ఇదిలా ఉండగా తాండూర్‌కు చెందిన కొందరు కాంగ్రెస్ నేతలను.. పోలీసులు రాచమర్యాదలు చేసి గ్రామానికి పంపించడం విమర్శలకు తావిచ్చింది.



### పెయిడ్ బ్యాచ్ అని హేళన చేస్తుండ్రు..

బీఆర్ఎస్ నాయకులతో పైసలు తీసుకున్నామని, పెయిడ్ బ్యాచ్ అంటూ హేళన చేస్తుండ్రు. ఎవరితో ఎందుకు పైసలు తీసుకుంటం. బీఆర్ఎస్ నాయకులు మా దగ్గరకు ఎందుకొస్తరు.. మా భూములు మేము కాపాడుకునేందుకే పోరాడినం. మేమంతా కాంగ్రెస్‌కే ఓటేసినం. తిరుపతిరెడ్డి ఎవరు? ఆయనకు ఏం సంబంధం ఉందని మా భూములపై పడుతుండు. ఓటు చేసింది రేవంత్‌రెడ్డికి.. ఆయనతోనే తేల్చుకుంటాం. పార్టీలు మాకు అవసరం లేదు. మేం కష్టంతో కాపాడుకొంటున్న మా భూములే మాకు కావాలి. ఎవరు, ఏం చెప్పినా మా భూములు వదులుకునే ప్రసక్తే లేదు.

**- పూజ, (ఇంటర్ విద్యార్థి) రోటిబండతండా, దుద్యాల మండలం**



### ముఖ్యమంత్రే మా కన్నీళ్లకు కారణం

ఈ రోజు మా అందరి కన్నీటిబాధలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే కారణం. ఆయన గెలిస్తే మా ప్రాంతానికి నీళ్లొస్తాయని భావించి ఓటేసి గెలిపించాం. కానీ నేడు గిరిజనుల భూములు లాక్కొని నిరాశ్రయులను చేసేందుకు ఆయన ప్రయత్నిస్తుండు. ఏం జరిగినా మా భూములు ఇచ్చే ప్రసక్తే లేదు. భూములు పోతే మేం ఏం తిని బతకాలి. ఉద్యోగమొద్దు.. పైసలొద్దు.. మా భూమే మాకు కావాలి.

**- జ్యోతి, రోటిబండతండా, దుద్యాల మండలం, వికారాబాద్ జిల్లా**



### తిరుపతిరెడ్డికి ఏం అధికారం ఉంది?

సీఎం రేవంత్ తమ్ముడు తిరుపతిరెడ్డికి ఏం అధికారం ఉందని ప్రజలపై దౌర్జన్యం చేస్తుండు.. ఎస్కార్ట్‌తో గ్రామాలకు వస్తున్నడు.. మేము ఎన్నుకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారు. ఆయన ఇంతవరకు మా సమస్యలు పట్టించుకోలేదు.. అటువంటిది తిరుపతిరెడ్డి ఇన్‌వాల్వ్ కావడం ఏమిటి? ఆయనపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోండి.. నాకు ఈ సారే ఓటు హక్కు వచ్చింది. రేవంత్‌రెడ్డి వస్తే బతుకులు బాగుపడతాయని నా మొదటి ఓటు కాంగ్రెస్‌కే వేశా. ఇప్పుడు బాధపడుతున్నా. మా నాన్న ఎక్కడపోయాడో? ఏమయ్యాడో? వారం రోజులైంది.. *- మంజుల, విద్యార్థిని, రోటిబండతండా, దుద్యాల మండలం, వికారాబాద్ జిల్లా*